# 19. ఆదర్శం

రోజా!

నిన్నరాత్రి నామీద అలిగి వెళ్ళిపొయ్యావు. నీ అలక తీరుస్తానేమో నని చూశావు. కాని నిన్ను 'డిసప్పాయింట్' చేయవలసి వొచ్చినందుకు విచారించాను. ఇలాగే మన యీ ఆరు నెలల స్నేహంలోనూ ఇది మూడోసారి జరిగింది. నామీద కోపంతో నీవు వెళ్ళిపోవటం నాకు ఆనందాన్నివ్వదు. కాని ఆ సమయంలో నేను 'నేను' కాదు; ఏదో మహత్తరశక్తికి లొంగిపోతుంటాను. ఆ ఒక్కక్షణంలోనూ ప్రపంచమంతా ఒక ఎత్తూ, నా విధి మరో ఎత్తుగానూ చూసుకుంటాను. నా యీ స్థితి నీకు అర్థమయ్యేట్లు చెప్పే అవకాశం నాకు కలగలేదు. అంతే! విని నీవు నవ్వుతావని కాదు. నీ కోపానికే భయపడని నేను, నీ నవ్వుకు భయపడతానా? నీకు అర్థమయేట్లు ఎలా చెప్పటమా అని ఆలోచిస్తూ యీ అర్ధరాత్రి, ఓపిగ్గా కూర్చొని యీ ఉత్తరం రాస్తున్నాను.

నా మనస్తత్వాన్ని అర్థంచేసుకొనేముందు, సరిగ్గా పది సంవత్సరాల క్రితం నా జీవితంలో జరిగిన ఒకానొక సంఘటనను వివరించవలసివుంది.

ఇంటర్ పరీక్షరాసి సెలవలకు ఇంటికి వొచ్చాను. అప్పట్లో ఇల్లంటే ఏముంది నాకు? చిన్నతనంలోనే అమ్మపోయింది. నాన్న ఆఫీసులో పగలల్లా చాకిరీ చేసి ఇంటికొస్తాడు. నా అనేవాళ్లులేని, వరసకు ఆయన విధవ చెల్లెలయే ఒకామె వంటచేసి పెడుతుంది. గృహలక్ష్మి లేనికొంప, శ్మశానం కాక మరేమిటి?

– కాని పదేళ్ళ తమ్ముడున్నాడు. వాడి ఆరో నెలలోనే అమ్మ పోయింది. వాణ్ని నాన్న ఎంత జాగర్తగా, కంటికి రెప్పల్లే కాపాడుతూ పెంచుకొచ్చాడో నీవు ఊహించలేవు. వీడంటే నాకు పంచప్రాణాలూను. వాణ్ని చూస్తే, అమ్మనే చూసినంత ఆనందమయేది.

ఐతే వాడికి ఎవరిమీదా ఆపేక్షలు లేవు. ఒకమూల వొదిగి కూర్చుంటాడు. పెద్దవాడైతే వీడు యోగి అవుతాడేమో ననిపించేది. అమ్మ వుంటే వీడు ఇలా ఉండే వాడా అనిపిస్తూండేది. వాడిచేత నవ్వించాలని, ఆడుకొని వాడి బాధను మరిపింపచేయాలని ఎంతో ప్రయత్నించే వాణ్ని. కాని వాడికి ప్రపంచంలో దేనిమీదా ఇంటరెస్ట్ లేదు. బహుశా తన మీద తనకే అనురాగంలేనివాడల్లే బతుకుతున్నాడు.

వాడి తత్వమే అదని సరిపెట్టుకోవాలని చూడటం ఆత్మవంచనే అవగలదు. ఏమైనా వాడిలో మార్పు తేలేని అసమర్థతను మాత్రం నేను పసికట్టాను. బహుశా నాన్నక్కూడా తెలిసి ఉండొచ్చు. ఎంత ప్రయత్నించినా వాడు దగ్గరవడు. చేసేదేముంది. అలాగే రోజులు గడుస్తూన్నవి.

ఎండలు నిప్పులు చెరుగుతూన్నవి. ఒకనాటి రాత్రి తమ్ముడికి జ్వరం వొచ్చింది. అసలే దీనాతి దీనంగా బతికేవాణ్ని, యీ జ్వరం ఎంత కుంగదీయగలదో, వాడి స్థితి చూస్తేనే అర్థమౌతుంది.

మర్నాడు డాక్టర్ గోపాలంవొచ్చి చూశాడు. యీ డాక్టర్ మాకు పుష్కరంనుంచీ కుటుంబ వైద్యుడుగా వుంటున్నాడు. ఈయన మీద మా అందరికీ గురి. వూళ్ళో చాలా పేరుపడినవాడు కూడాను.

కాలం బరువుగా కదులుతోంది. కాని, తమ్ముడి జ్వరం తగ్గలేదు సరికదా, రోజు రోజుకూ ఎక్కువ సాగింది. వాడా తట్టుకునే స్థితిలో లేడు. ఎండలా మాడిపోతున్నవి. వాణ్ని చూస్తుంటే వీడు బతకడేమోననే అనుమానం వొచ్చి వొణికిపొయ్యేవాణ్ని.

ప్రాణాన్నిచ్చున్నా వీణ్ని రక్షించుకునేందుకు నేను సిద్ధంగా వున్నానంటే, వాడిమీద నాకు ఎంత మమకారమో ఆలోచించు. అమ్మ పోతూ పోతూ తన జ్ఞాపకంగా మా కుటుంబానికి వొదిలిపోయిన యీ చిట్టి తమ్ముణ్ణి పోగొట్టుకోలేను. కాని నా చేతుల్లో ఏముంది?

మరో రెండు రోజులు గడిచేప్పటికి పరిస్థితి విషమించింది. నాన్న ఆఫీసుకు సెలవుపెట్టి వాడి మంచం దగ్గరే కూర్చుంటున్నాడు. మగతగా పడివుండటం, ఎప్పుడన్నా కళ్ళుతెరిచి బాధగా, జాలిగా, దీనంగా ఒక్కసారి అందరివంకా చూడటం, మళ్ళీ యోగనిద్రలోకి పోబొయ్యే తపసిలాగు కళ్ళు మూయటమూను. వాడికి ఏమీ అక్కర్లేదు. చివరకు మంచినీళ్ళు కూడా! నాన్న తడయ్యే కళ్లు తుడుచుకోవటం చూస్తే, ఏదో గొప్ప అశుభం జరిగి తీరుతుందనే నా అంతరాత్మ హెచ్చరిస్తూ వుంది.

దేవుణ్ని నమ్మటం మౌఢ్యమనుకున్న నేను, దేవుణ్ని ప్రార్థించాను. కష్టకాలంలో మతులుపోయి, మనుషులు తమతమ ఆదర్శాలను, అంతరాత్మల్ని కూడా విసర్జిస్తారు కాబోలు!

మూడో రోజు సాయంత్రానికి వూపిరి అందక, కాళ్లూ చేతులూ కదుపుతూ తన్నుకోసాగాడు వాడు. ఆ భగవంతుడికే నిజంగా కరుణ అంటూవుంటే, యీ బాధతో వాణ్ని చంపివుండేవాడు కాదు. నాన్నకు కాళ్లూ చేతులూ వొణుకుతూన్నవి. కుర్రాడేమో యమయాతన పడుతున్నాడు. ఇక నాస్థితి చెప్పనక్కర్లేదు. చూడలేక కళ్లు మూసుకున్నాను.

"డాక్టర్ను పిలుచుకురా బాబూ!" అన్నాడు నాన్న, దుఃఖం పొంగి పొరలే కంఠంతో.

అయోమయంలోనుంచి ఊడిపడ్డాను. సైకిల్ తీసుకుని శక్తికొద్దీ తొక్కుతున్నాను. రోడ్డుమీద వచ్చేపొయ్యే ఇతర శకటాల్ని కానీ, మనుషుల్నీ కానీ లెక్కచెయ్యటం లేదు. ఒకటి రెండు తావుల్లో వెంట్రుకవాసిలో పెద్దప్రమాదాలు తప్పినవి. ఐతే నా ప్రాణం, నా జాగ్రత్త విషయం నేను ఆలోచించటం లేదు.

తమ్ముడు బతకాలి - ఎలాగైనా సరే! యీ అశుభం పర్వత ప్రమాణంలో తల మీద పడబోతున్నదని రూఢిగా తెలుసు. ఎలాగైనా తప్పించుకోవాలని, ఏ మందుమాకులో వాణ్ని రక్షించ గలుగుతయ్యేమోననే ఆశతోనే వున్నాను. అది అసంభవమవుగాక - కాని ఆశకూ, అసంభవానికీ సంబంధం లేదు మరి.

సాయంత్రం ఏడుగంటలైంది. ఇంతకు ముందే వీధిదీపాలు వెలిగించబడినవి. డాక్టర్ ఇంటి దగ్గిర లేడు. నాకేమో ఆతృతతో కాళ్లు వొణుకుతూన్నవి. బహుశా క్లబ్ దగ్గిర వుంటాడని తెలుసుకున్నాను. మళ్ళీ సైకిల్ను క్లబ్ వైపు ఉరికించాను. ఇదో గొప్ప రేస్వలెనే తోచింది నాకు. యీ రేస్ మృత్యుదేవత వెంబడించగా జరిగేది- మామూలు పోటీ పందెమా?

అదృష్టవశాత్తూ డాక్టర్ అక్కడ వున్నాడు. ఇంకా ముగ్గురితో కలిసి ఆరుబైట చీట్లపేక ఆడుతున్నాడు. ఆట చాలా పట్టుదలగా జరుగుతోందో, లేక డాక్టర్గారు డబ్బు పోగొట్టుకున్నాడో తెలియదుకాని, ఆయన మొహంలో చాలా పరాకూ, చిరాకూ కనిపించింది. పేకముక్కల మీదనుంచి ఒక్కసారి కళ్ళెత్తిచూచి, చూడనట్లే, తన ఎదుట ఏమీ లేనట్లే మళ్ళీ ముక్కల్లో మునిగిపొయ్యాడు.

ఒక్క నిమిషంసేపు నేను అలుపు తీర్చుకున్నాను. కాని బుర్ర చాలా తీవ్రంగా పని చేస్తోంది. యీ డాక్టర్ నన్ను చూసి కదలడేం? నాలో వుండే ఆతృతను గ్రహించలేదా?... ఐనా నేనింకా అసలు విషయం చెప్పనే లేదనే సంగతి జ్ఞాపకం వొచ్చింది.

మెల్లిగా డాక్టర్ దగ్గిరికి వెళ్ళాను. ఆయన కళ్లెత్తి నావైపు చూశాడు. ఆ చూపులో ఆహ్వానం లేదు. 'ఇప్పుడెందుకు వొచ్చావ్?' అనే నిరసన భావం వుంది. ఐనప్పటికీ నేను లెక్క చేయలేదు.

"డాక్టర్గారూ! తమ్ముడికి చాలా ప్రమాదంగా వుంది. మీరు వెంటనే రావాలి" అన్నాను. జాలిగొలిపే కంఠస్వరంతో.

"వస్తాను–" అన్నాడాయన. కాని వొచ్చే ప్రయత్నాలేమీ లేవు. మిగతావాళ్ళతో కలిసి చీట్లపేకలోని తమాషాల్ని గూర్చి నవ్వుకుంటూ, వాదిస్తున్నాడు.

నేను శిలాప్రతిమవలె నిలబడి చూస్తున్నాను. నేను డాక్టర్‌తో మాట్లాడిందేమిటో మిగతా ముగ్గురు పెద్దమనుషులూ విన్నారు. వాళ్ళెవ్వరికీ చీమకుట్టినట్లుగా కూడా లేదు. అది నాకు కష్టమనిపించలేదు కాని, యీ డాక్టర్, బాధిత మానవ ప్రపంచమంటే తెలిసిన యీ నాగరికుడిలో కూడా చలనం లేదు, ఎందుకని? వీడేం పశువా, మనిషా అనే సందేహం నాకు కలగటంలో ఆశ్చర్య మేమిటి? క్షణక్షణానికీ చేతి గడియారంవైపు చూస్తూనే వున్నాను.

తమ్ముడు జీవన్మరణాల మధ్యవున్న దృశ్యం నన్ను ఒకపక్క కదిలించి చెప్పలేనంత తొందర పెడుతోంది. డాక్టర్ అసలు నేను వొచ్చిందే మరిచిపోయి నట్లున్నాడు. ఆయన వినోదం చూస్తుంటే అరికాలిమంట నెత్తికెక్కుతోంది. క్షణక్షణమూ నాలో కోపం రగులుతోంది.

పావుగంటసేపు ఊపిరి బిగపట్టి ఎదురుచూశాను. ఆయన కదిలేట్లు లేదు. మెల్లిగా, పిల్లల్లే టేబిల్ దగ్గిరికి వెళ్ళి దీనంగా "డాక్టర్‌గారూ!" అన్నాను. "ఇదుగో – వొస్తున్నా!" అన్నాడాయన. కానీ మళ్ళీ ఆటలో పడిపొయ్యాడు.

వీడు మానవుడా, దానవుడా అని తర్కించుకుంటున్నాను. వీడు మానవుడైతే వెంటనే వొచ్చేవాడు. దానవుడైతే మానవుల మధ్య బతికే అర్హత ఉండేందుకు వీల్లేదు. నాలోని యువరక్తం పొంగి పొరలుతోంది. ఆ వేడికి రక్తమే ఆవిరవుతుందా అన్నంత అనుమానం కలుగుతోంది.

ప్రపంచమంటే ఒకప్రక్క జీవన్మరణాల పొలిమేరల్లో వున్న తమ్ముడూ, మరోపక్క యీ డాక్టరూ తప్ప నాకింకేమీ లేదు. క్షణక్షణమూ నాలోని కోపాగ్ని మిన్నుముట్టే ప్రయత్నాలు చేస్తూనే వుంది. మానవత్వమంతా రంగు మార్చుకొని, దానవత్వ మవుతోందని నాకు తెలియదు.

యీ డాక్టర్‌కు బుద్ధి చెప్పాలి. ఏది ఏమైతే నేమి, ఇలాటి ఆలస్యం చేసి, మానవప్రాణాలతో చెలగాటా లాడకుండా మంచిపాఠం చెప్పాలి. వీడు వృత్తిధర్మాన్ని, అన్నిటికన్నా మానవధర్మాన్నే మరిచాడు. జీవితమంతా జ్ఞాపకం ఉండేట్లు చేయాలి. దీనాలాపాలు లాభం లేదు; శారీరకమైన బలాన్ని ఉపయోగించక తప్ప దనిపించింది.

అసలే వేడిరక్తం. ప్రపంచంలో జరిగే అన్యాయాలకు, అక్రమాలకు చాటుగా ఏడుస్తూ, సాధ్యమైతే మానవుల హక్కుల్ని సాధించి తీరాలనే ఆశయాలతో, పట్టుదలతో వేగిపొయ్యే రోజులవి. అందులోనూ యీ హక్కు, యీ అక్రమం, నాకు, నా తమ్ముడికి, మా కుటుంబానికీ జరుగుతోంది. న్యాయమైన యీ హక్కును సాధించుకోవటం నేరమా?

క్షణంలో నన్ను నేను మరిచిపొయ్యాను. నాలో యేయే ఉద్రేకాలు పేలినవో తెలియదు. ఒక అగ్నిపర్వతమే లోన బద్ధలైనంత ఆవేశం వొచ్చింది. ఆ లావాల వేడి బైటికిపోకుండా నన్నే దహించివేస్తుందని తెలుసు. సభ్యతా ప్రపంచంలో జరిగే ఒక అసభ్యాన్ని, మరో అసభ్యం ద్వారానే ఖండించేందుకు సిద్ధపడ్డాను.

ఒక్క ఉరుకులో టేబిల్ దగ్గిరికి వెళ్ళాను. డాక్టర్ చేతులోవున్న పేకముక్కల్ని లాగేసి, సగానికి చింపి పారేశాను. డాక్టర్ నోరు సగానికి తెరచి, నిశ్చేష్టుడై నావైపు చూస్తున్నాడు. మిగతావాళ్లలో కూడా చలనం లేదు. చాచి ఒక్క లెంపకాయ కొట్టాను. ఆ దెబ్బకు డాక్టర్‌కు గింగిరాలు తిరిగి ఉంటవి. సున్నితంగా వుండే అతని చెక్కిలి, నాన్ రొట్టెవలె బుసబుసా పొంగింది. కళ్ళజోడు ఎక్కడ పడిందో తెలియదు.

“లే... బయలుదేరు!” అన్నాను, ఆజ్ఞాపించే కంఠంతో. యీ గర్జనకు మిగతావాళ్లు మళ్ళీ యీ లోకంలో పడ్డట్లున్నారు. మనుషులు కదులుతున్నారు. చాలా తొందరపడ్డానని తెలుస్తోంది. యీ మిగతావాళ్ళు తిరగబడితే, సున్నంలోకి ఎముక ఉంచరనీ తెలుసు. ఐతేనేం యీ ప్రళయకాల శివునిరూపానికి యీ ప్రపంచమంటే భయం లేదు.

వాళ్లు ముగ్గురూ లేచి నిలబడ్డారు. నా ఉద్రేకం ఇంకా తగ్గలేదు. డాక్టర్ లేవలేకపోతున్నాడో, ఇలా జరిగిందని విచారిస్తున్నాడో, లేక నామీద కసి తీర్చుకోవటం ఎలాగని ఆలోచిస్తున్నాడో తెలియటం లేదు. మొత్తం మీద ఆయన ఇంకా లేవలేకపోవటంతో సహజంగా చల్లారవలసిన నా ఉద్రేకం మళ్ళీ వేడెక్కుతోంది. డాక్టర్ రెండో చెంప వాయగొట్టేందుకు చెయ్యెత్తాను.

మిగతా ముగ్గుర్లో ఒకడు దబదబావొచ్చి, నా చేతిని గట్టిగా పట్టుకున్నాడు. కాని నేను విదిలించేప్పటికి పోయి పిట్టగోడ మీద పడ్డాడు. యీ అన్యాయాన్ని ఖండించేందుకూ, న్యాయాన్ని స్థాపించేందుకూ, మిగతా ఇద్దరూ నా మీదికి ఉరుకుతున్నారు. చేతులో చాకు వుంటే ఒక్కొక్కరుగా నా చేతులో చచ్చేవాళ్ళు!

డాక్టర్ నా మీదికి వొచ్చేవాళ్ళను వారించాడు. యీ గందరగోళానికి క్లబ్‌లో మిగతా జనమంతా గుమికూడారు. అసలు విషయం తెలియక ఏమేమో మాట్లాడు కుంటున్నారు.

మెదలకుండా డాక్టర్ కళ్ళజోడు ఏరుకున్నాడు. ఆయన మొహం వెల వెల బోతోంది. “పద–వెళ్దాం” అన్నాడు చాలా ప్రశాంతంగా.

నాకు అక్కడే కూర్చొని ఏడవాలనిపించింది. యీ డాక్టర్ నన్ను అర్థం చేసుకున్నాడు. నేనెందుకు అంత తొందరపడ్డానో ఆయనకు తెలుసు. తను నా స్థితిలోవుంటే ఏంచేసేవాడో, నేనూ అదే చేశానని అనుకొని వుండాలి... కాని ఇక్కడ కూర్చొని ఆలోచించే సావకాశం లేదు. ఆయన కారెక్కాడు. నేను సైకిల్ ఎక్కాను.

దారి పొడుగునా ఆలోచిస్తూనే వున్నాను- ఇలాటి వెధవపని ఎందుకు చేశానా అని. కాని ఇలా చేయకుంటే డాక్టర్ కదిలేవాడు కాదేమో? ఇంతా ఏడుస్తే నేను ఉద్రేకంలో ఆయన్ను కొట్టినా, అది కేవలం ఆయన మైమరచిన వృత్తిధర్మాన్ని జ్ఞాపకం చేయటమేనేమో ననిపించింది... చివరకు ఆయన తిరిగి నన్నొకటి కొట్టినా, నేను రానుపొమ్మని కసిరి పంపినా బాగుండేది... కాని అలా అంటే, ఏ కుర్చీయో ఆయన తలమీద విరిగేది.

యీ తర్కాలకన్నా తమ్ముడి స్థితి ఏమిటనే బాధ కలిగింది. నిజంగా తమ్ముడు బతుకుతే జీవితమంతా యీ డాక్టర్‌కు దాస్యం చేస్తాను... కాని వాడు ఛస్తే... దానికి యీ డాక్టర్‌చేసిన ఆలస్యమే కారణమౌతుంది. దానికి శిక్షగా నేను ఆయన్ను కొట్టాను. పదిమందిలో అవమానించాను. అది చాలుతుందా? చాలదు... మా తమ్ముడితోపాటే, వీణ్ని కూడా పై లోకాలకు పంపుతాను... నేను చేసిన పని మిగతా డాక్టర్లందరికీ ఆదర్శప్రాయం కాగలదు. ఆ పని చేస్తే నాకు ఉరిశిక్ష పడుగాక, అది వేరే సంగతి. ఒక ఆదర్శంకోసం చావటం, దాన్ని సాధించటం చేయగలిగిన జీవితం ధన్యమే అవగలదు.

నురుగులు కక్కుతూ ఇంటికి వొచ్చిపడ్డాను. అప్పటికే డాక్టర్ వొచ్చాడు. రోగి కొనఊపిరితో కొట్టుకుంటున్నాడు. ఆర్టిఫిషల్ రెస్పిరేషన్ ఇద్దామని డాక్టర్ ప్రయత్నిస్తున్నాడు. కాని, తమ్ముడికి ఊపిరి అందటం లేదు. గుడ్లు తేలేస్తున్నాడు. అంత్యక్షణాలనే సంగతి ఇట్టే చెప్పవొచ్చు. కాళ్ళూ చేతులూ వేళ్ళాడేసి ఇక కదలిక లేకుండా పడిపొయ్యాడు వాడు. డాక్టర్ నిస్సహాయంగా, తాను చేయగలిగింది లేదని పెదవి విరిచాడు.

తమ్ముడు పొయ్యాడు. మరి కొద్దిగంటల్లో భూస్థాపిత మౌతాడు. ఇక యీ జన్మకు వాణ్ణి చూడలేను. యీ భావాలు నాలో కలిగినవి. లోపలనుంచి తోసుకొచ్చే దుఃఖాన్ని ఆపుకుంటున్నాను. నాన్నకూడా యీ బాధను భరించేందుకు, ధైర్యంగా కనిపించేందుకు, విశ్వప్రయత్నం చేస్తున్నాడు. యీ విచారంలో డాక్టర్‌మీది కోపమంతా కొట్టుకొని పోయింది.

డాక్టర్‌వైపు చూద్దును - నాచేతి ఐదువేళ్ళూ తేలిన ఆయన చెంపమీదినుంచి ఒక కన్నీటి కణం కిందికి జారేందుకు సిద్ధంగా వుంది... రోగి బాధను డాక్టర్ అనుభవించటమంటే ఏమిటో నాకా క్షణంలో అర్థమైంది... ఈయన నిజంగానే తమ్ముడికోసం ఏడుస్తున్నాడు! ఇంత మెత్తని హృదయమున్నవాణ్ని కొట్టేందుకు నాకు చేతులెలా వొచ్చినవో ననిపించింది. అప్పుడే, అక్కడే డాక్టర్ కాళ్ళ మీద పడదా మనిపించింది. కాని, ఆయన లేచి నిలబడి, నా దగ్గిరికివొచ్చి, ధైర్యంగా వుండమని సూచించేందుకేమో, వీపుమీద తట్టి మెల్లిగా వెళ్ళిపొయ్యాడు. బహుశా మాట్లాడలేకపోయి వుంటా డనుకుంటాను.

ఇక ఆ కాళరాత్రి తమ్ముడి శవానికి జాగరణే ఐంది. నాన్నకు ఒక్కటే సమస్యయితే, నాకు రెండు. పోయిన తమ్ముణ్ని గూర్చి ఆలోచించటంకన్న, నేను చేసిన ఘాతుక చర్యను గూర్చిన తర్కంతో వేగిపోతున్నాను.

మన పిచ్చికాని డాక్టర్లు మందులు పోయగలవారే కాని, అమృతం పోయలేరు కదా! మరణాలు డాక్టర్లు తక్కువయీ, మందులు తక్కువయీనా? ఏదో ఒకానొక అదృశ్యశక్తి జీవితాల్ని హరిస్తోంది- అంతే! నాకు హాని జరిగింది కనుక, ఇదేదో పొరపాటున, ఎవరి తప్పువల్లనో జరిగిందనీ, ఒక నేరస్థుణ్ని వెతికి సరిపెట్టుకునేందుకు చూస్తున్నాను- అంతే! ఇదొక బలహీనత కాని, ఇప్పుడు ఆలోచిస్తుంటే నా మూర్ఖత్వం తెలిసి వొస్తోంది... ఐతే డాక్టర్ వెంటనే బయలుదేరితే, వాడు బతికేవాడేమోననే భావం మూలకు వొదిగి వుంది. అలా జరుగుతే యీ కాస్త అసంతృప్తి కూడా వుండేదికాదు.

డాక్టర్ వెళ్ళేప్పుడు, ఆయన ముఖకళ ఎంత దీనంగా వుంది! జీవితంలో మానవుడు క్షణంలో అలా కుప్పగా కూలిపోయి, పట్టు విడిచి అధఃపాతాళాలకు పడటం మరి ఎక్కడా చూడలేదు. పెద్దగా ఏడవటం ఒక్కటే తక్కువగా తోచింది.

వారంరోజులు గడిచినవి. ఒంటరిగా గదిలో కూర్చొని తమ్ముడు ముద్దుమాటల దగ్గర్నుంచీ, జాలిగొలిపే వాడి స్థితివరకూ తలుచుకొని, నాలో నేనే కరిగిపోతున్నాను. మరోపక్క ఏవిధంగా యీ డాక్టరుకు క్షమార్పణ చెప్పుకోవాలా అని ఆలోచిస్తున్నాను. మళ్ళీ ఆయన ఎదుటపడేందుకు మొహం చెల్లకుండా వుంది. కాని కల్మషాత్మ నన్ను పిండిపారేస్తోంది.

చివరకు ఒకనాటి సాయంత్రం హాస్పిటల్‌కు బయలుదేరాను. యీవేళప్పుడు ఆయన క్లబ్‌లో వుంటాడనీ, యీ సాకు మీద కలవలేక పొయ్యాననే సంతృప్తి ఉంటుందనీ నా ఆశ.

–కాని నేను అనుకున్నదంతా తలక్కిందులైంది. డాక్టరుగారు చాలా తీరిగ్గా కన్‌సల్‌టింగ్ రూంలో కూర్చొని చదువుకుంటున్నాడు. నన్ను చూడగానే మీదపడి చావతంతాడనుకున్నాను కాని, అలాటిదేమీ జరుగలేదు. నవ్వుతూ ఆహ్వానించాడు. ఆయనవైపు చూద్దును- ఈ వారం రోజుల్లోనే ఆయన కనీసం ఏడు సంవత్సరాల జీవితం గడిపినట్లున్నాడు. నడి వయస్సువాడు ముసలివాడైనట్టుంది. చాలా వెంట్రుకలు నెరసినయ్యనుకుంటాను. ముఖంలో ఎంతో గంభీరత, కళ్ళల్లో అంతులేని లోతులు కనిపిస్తూన్నవి... ఇదంతా నా తమ్ముడి చావు వల్లనేనా?

ఈయన్ను చూస్తే ఎంతో జాలివేసింది. అంతకన్న నా మీద నాకు చెప్పలేనంత ద్వేషం కలిగింది. నా క్రౌర్యానికి డాక్టర్ చూపే యీ దయ ప్రతిఫలం! తలుచుకుంటే

ద్రవించి పోతున్నాను. నా యీ అనుభూతి ఎలా మాటల్లో చెప్పాలో అర్థం కావటం లేదు.

చివరకు నిలవతొక్కుకుని "డాక్టర్‌గారూ! నన్ను క్షమించండి... కాదు ... నా నేరానికి ఏదైనా శిక్ష విధిస్తేనే కాని నాకు మనశ్శాంతి రాదు" అన్నాను. కళ్లు తడి అవుతూన్నవి. మనోవ్యధ కదిలించి వేస్తోంది.

డాక్టర్ నవ్వాడు: "నీ తప్పేం వుంది ఇందులో?" అన్నాడాయన. "నీవు ఒక రకంగా నాకు మేలుచేశావనుకుంటున్నాను. నా వృత్తిధర్మాన్ని మరిచిపోయిన క్షణంలో జ్ఞాపకం చేశావు. ఇక ఈ జన్మలో మళ్లీ మరిచిపోను–"

హానిని మేలుగా చూడగల దైవస్వరూపుడా ఈయన అనిపిస్తోంది. ఒక పెద్ద మనిషిని, సాత్వికుణ్ని, అనవసరంగా అవమానించాను. నేనూ పెద్దమనిషిని కనుకనే ఈ బాధ – లేకుంటే ఇదొక అల్ప విషయమయ్యేది.

"అలా దిగులు పడొద్దు" అన్నాడు డాక్టర్. "పైవాళ్ళకు ఇదొక నీచకార్యంగా కనిపించవచ్చు. కానీ, ఇందులో రహస్యం మనిద్దరి హృదయాలకూ తెలుసు. మిగతావాళ్ళ అభిప్రాయాలతో పనేమిటి?...ఏదో తప్పు చేసినందుకు తగిన శిక్షను అనుభవించిన తృప్తి నాకువుంది. దాన్నిగూర్చి నేను ఆలోచించవలసిన అవసరం లేదు... నాలో చాలా మార్పువొచ్చింది కూడాను. ఆనాటినుంచి ఇక జీవితంలో పేకాట ఆడకూడదని శపథం చేశాను. అంతేకాదు ... ఎవరైనా నా సహాయం కోసం వొస్తారేమోనని, సిద్ధంగా కూర్చున్నాను. బతికివున్నంత కాలం, నే నీ బాధిత ప్రపంచంకోసం ఇలాగే వేచి కూర్చుంటాను."

ఆ మాటలు వింటుంటే వొణికిపొయ్యాను. మానవ హృదయమంటూ ఉంటే ఎలాటి అనుభూతి కలుగుతుందో తేలిగ్గా అర్థమౌతుం దనుకుంటాను. ఇంకొక్క అనుమానం నన్ను పీడిస్తోంది.

"డాక్టరుగారూ! ఒక్క సంగతి దాపరికం లేకుండా చెప్పండి... మీరు అరగంట ముందు బయలుదేరి వుంటే, తమ్ముడు బతికేవాడా?" అన్నాను.

ఆయన పేలవంగా నవ్వాడు. ఒక్క క్షణం విషయపరిశీలన చేసినట్లున్నాడు. అన్నాడు: "ఉహుఁ. బతుకుతాడనే ఆశలేమీ లేవు. కాకపోతే మరో రెండుగంటలు అలాగే బాధపడేవాడు... కాని నా విధి నేను నిర్వర్తించలేదనే బాధ మిగిలింది. అంతే!"

ఒకవిధంగా చూస్తే తమ్ముడి బాధను నివారించాడా అనిపిస్తోంది. ఇక ఒక్కక్షణం కూడా అక్కడ ఉండలేక పొయ్యాను.

"వొస్తాను... డాక్టర్‌గారూ!... నన్ను క్షమించండి..." అని బైటపడ్డాను.

ఆ రోజునే నా జీవితంలో అనేక మార్పులు వొచ్చినవి. వర్తమానంలో నుంచి భావిని నిర్ణయించుకునేందుకు యీ మార్పులే కారణం. కేవలం ఒక్క సంఘటన జీవితాన్ని ఎలా మారుస్తుందో, ఏ దిక్కుకు తోలుతుందో ననిపిస్తుంది!

ఇన్నాళ్ళూ చదవటం దేనికని ఎన్నడూ ఆలోచించలేదు. ఇప్పుడా ఆలోచన కలిగింది. చదివి సంపాయించుకొని జీవితాన్ని గడపాలి. చదవని వాళ్లుకూడా బతుకుతూనే ఉన్నారు. ప్రపంచంలో కొన్ని వృత్తులు మాత్రమే గౌరవనీయమైనవిగా భావించబడుతూన్నవి. దూరం ఆలోచిస్తే యీ గౌరవా గౌరవాలు చాలావరకు మనం కల్పించుకున్నవేననిపిస్తుంది. ఉదాహరణకు వ్యభిచారం వృత్తిగా బతకటం నీచమని కదా! కాని జీతం తీసుకునో, లంచం తీసుకొనో పొగడ్తల వర్షం కురిపించే రచయిత నీచుడు కాదు; అతని వృత్తికి గౌరవం వుంది. వ్యభిచారిణి శరీరాన్ని అమ్ముకుంటే, యీ రచయిత ఆత్మను అమ్ముకుంటున్నాడు. ఐతే నీచవృత్తిలో వున్నాడనటంలేదు మనం ఎందుకని?

నేనూ కొద్దిరోజుల్లోనే ఏదో వొక వృత్తిలోకి ప్రవేశించాలి. ఆ వృత్తి ఏమిటనే ఆలోచన ఇప్పుడే కలిగింది. నాకీ సంఘటనే జవాబిచ్చింది. నేను వైద్యవృత్తిలో జీవితాన్ని గడుపుతాను. డబ్బు ఎంత సంపాయించగలుగుతానని కాదు. ఎంత గౌరవ మర్యాదల్ని పొందుతాననీ కాదు. బాధిత మానవులకు ఏమైనా సేవచేసే అవకాశం లభిస్తుందనేదే ముఖ్యంగా ఆలోచించింది.

మనం ఎంతో సంపాయించ వొచ్చు. లేదా ఉన్నదంతా అనుభవించి, ఆనందించవొచ్చు. అదంతా ఒక వ్యక్తిగత అనుభూతి... కాని యీ స్వార్థచింతలోనే పరమార్థ చింత ఉండక్కర్లేదా? మన అనుభవాలు మనవే. వాటిని గూర్చి ఇతరులు ఏమైనా అనుకోవచ్చు. కాని జీవితంలో మనం ఇతరులకు ఏమైనా మేలు చేయగలిగామా? యీ మేలువల్ల గొప్పతనం, పొగడ్త లభ్యమౌతయ్యని కాదు. మానవుని ఆత్మ ఎంత వికసిస్తుందో, నిజంగానే బతుక్కు ఎంత గొప్ప ఆదర్శం, అర్థం ఏర్పడుతుందో ఆలోచించాను. క్షణంలో నిర్ణయించుకున్నాను కూడాను.

యీ ఇంటర్ పరీక్షలో మంచిమార్కుల్తో పాసవుతాననే నమ్మకం వుంది. తరువాత యం.బి.బి.ఎస్. చదువుతాను. నేనూ డాక్టర్నవుతాను... అప్పుడు నేనొక ఆదర్శాన్ని మనసులో ఉంచుకొని జీవితాన్ని గడపగలను. రంగునీళ్ళు పోసి డబ్బు గుంజటం కాదు. డబ్బు ప్రసక్తి లేకుండానే వృత్తిధర్మాన్ని అనుసరిస్తాను- డబ్బు రానీ రాకుండనీ అది వేరే సంగతి. ఒక్క పూట మనమీ ప్రపంచ సౌఖ్యంకోసం పస్తు పడుకోలేమా? మనకొరకై మనంపడే బాధ లెన్నయితే ఎవరికేం? ఇతరులకోసం, ప్రపంచ క్షేమంకోసం పడే బాధలేమన్నా ఉంటే, నిజంగా చెప్పుకొని గర్వించదగినవి అవే! మనం బతకటం కాదు- మనం ఇతరులను బతికించగలగటం; మన సౌఖ్యం కాదు- ఇతరులు,

అందులోనూ బాధపడేవారిని సుఖపెట్టగలగటం... యీ ఆదర్శాన్ని తలుచుకొని పులకరించాను...

ఇలాటి ఆదర్శంలేని వైద్యవృత్తి చాలా హీనంగా కూడా కనిపించింది. తెలివిగలవాళ్లు తెలివిలేనివాళ్లను పరిపాలిస్తూ పిండుకుంటున్నారు. బలవంతుడు బలహీనుణ్ని అణిచివేస్తున్నాడు... వీళ్ళు ఒకో వృత్తిలో తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించి, తమ సుఖ సౌఖ్యాలకోసం పాకులాడుతున్నారు. డాక్టర్ డబ్బుకే ప్రాధాన్యతను ఇచ్చినట్లయితే దాని అర్థం ఇది; మానవుల బాధల్ని రొక్క రూపానికి మార్చుకోవటం. ఇంతకన్న వ్యభిచారిణి లక్షరెట్లు నయం– ఆమె ఆనందాన్ని మాత్రమే రొక్కానికి మార్చుకుంటోంది. యీ తలపులన్నీ కలిసి నా జీవిత గమనాన్ని మార్చినవి. కావలసిందల్లా మనోధైర్యం, పట్టుదలాను.

నెలరోజులదాకా ఇంట్లోంచి బైటికి రాలేదు. ఆ తరువాత విసుగుపుట్టి స్నేహితుల్ని చూసేందుకు బయలుదేరాను. మళ్ళీ బైటి ప్రపంచంతో, తెంపుకున్న సంబంధాలను ఏర్పరచుకుంటున్నాను.

ఊళ్ళో పరిస్థితులు తారుమారైనట్లు కనిపించినవి. నే నానాడు డాక్టర్ను కొట్టినందుకు నన్ను చాలామంది అభినందించారు. నేనొక గుణపాఠం నేర్పినందుకు సంతోషించారు. కాని ప్రతి అభినందనా నా హృదయాన్ని గాయపరుస్తూనే వుంది. ఎందుకంటే ఆ పనికి వెనుక వున్న ఆంతర్యం నాకూ, డాక్టర్‌కు మాత్రమే తెలుసు. ఈ మిగతా వాళ్ళందరూ బైట వుండి, తమ చిత్తం వొచ్చినట్లు వూహించి, బాధ్యతారహితంగా వాగేవాళ్ళే! ఒక్క క్షణమన్నా ఆలోచించరు. ఏదో వొకటి వాగుతే సరిపోతుందనుకుంటారు. ఐతే యీ దురభిప్రాయాన్ని వొదలకొట్టటం ఎలాగో నాకు అర్థం కాలేదు. నా మనోవ్యథ వీళ్ళల్లో ఎవ్వరికీ అర్థంకాదు. అందుకు ప్రయత్నించరు. ముందుగానే ఒక నిశ్చితాభిప్రాయాన్ని ఏర్పరచుకున్నవాణ్ని ఒప్పించటం ఎంత కష్టం!

ముందుగా ఈ వాతావరణం నుంచి బైటపడితేనే కాని మనశ్శాంతి లభించేట్లు తోచలేదు. అంతా కృత్రిమంగా కనిపించింది. యీ మనుషు లందరూ ఏవో అదృశ్యశక్తుల వల్ల నడుస్తున్నారేకాని, తమంతట తాముగా కాదు; అందుకనే అర్థరహితంగా కనిపిస్తోం దీ ప్రపంచం.

ఇంతలో పరీక్షా ఫలితాలు వొచ్చినవి. ఫస్టుక్లాసులో పాసయ్యాను. తరువాతి కార్యక్రమం ఏమిటని నాన్న అడిగినప్పుడు, యం.బి.బి.ఎస్. చదువుతా నన్నాను.

ఆయన ఎక్కువ ఆలోచించలేదు. తన తలకుమించిన బరువవుతుందని కూడా అనుకోలేదు. "నీ ఇష్టం" అన్నాడు. తమ్ముడిమీది అనురాగం కూడా ఆయన నామీదనే చూపుతున్నాడు.

ఎలాగో సీటు దొరికింది. మెడికల్ కాలేజీలో జేరాను. ఒక మహత్తరమైన ఆదర్శం కోసం పోరాడుతున్నాననే మాట స్మరించుకుంటూ సాధ్యమైనంత తక్కువఖర్చుతో గడుపుతూ, చాలా కష్టపడి చదవసాగాను.

మొదటి సంవత్సరం సెలవల్లో ఇంటికి వొచ్చాను. ముందుగా డాక్టర్ను చూడాలనిపించి వెళ్లాను... కాని ఆ ఇల్లు ఆయన ఖాళీ చేశాడు- ఇంకెక్కడికన్నా మార్చాడేమో ననుకున్నాను. తీరా విచారిస్తే, ఆయన ప్రాక్టీసంతా పడిపోయిందనీ, యీ వృత్తి లాభంలేదని పల్లెటూరువెళ్ళి, వ్యవసాయం చేయిస్తున్నాడనీ తెలిసింది. మనస్సు చివుక్కుమంది. ఇదంతా నేనానాడు ఆయన్ను కొట్టిన దెబ్బ ఫలితమే! అది ఆయన శరీరానికే కాకుండా, ఆయన జీవితానికే తగిలింది. అనాలోచితంగా, ఉద్రేకంతో చేసే పనులు ఎంతదూరం వెళ్తవో అర్థమైంది.

-కాని ఇప్పుడు నేను చేయగలిగిం దేమీ లేదు. ఈ డాక్టర్ జీవితమంతా గుర్తుంటాడు... నేను మాత్రం డాక్టర్నయినప్పుడు, తప్పటడుగులు వేయరాదు. నేను అనుకున్న ఆదర్శాన్ని అనుసరించేందుకు మరింత పట్టుదల కలిగింది.

నాన్న నేనేదో డాక్టర్నయి బోలెడు సంపాయిస్తాననీ, నా ఉద్దేశ్యమూ అదేననీ అనుకుంటున్నాడు. ఇది సహజమే! కాని నా ఉద్దేశ్యం అది కాదనే సంగతి ఎన్నడూ చెప్పేందుకు సాహసించలేదు. ఎందుకంటే నా ఆదర్శాన్ని వేరెవ్వరూ, చివరకు నాన్నకూడా అర్థం చేసుకోలేడు. నేనేదో తనను మోసగించాననీ, తన కష్టాన్ని పిండుకున్నాననీ అపోహపడతాడు. ఈ ముసలితనంలో ఆయన్ను బాధించటం దేనికి? ఎవరికీ కష్టం లేకుండానే నా ఆదర్శాన్ని జీవితంలో అనుసరించగలననే ధైర్యం వుంది.

తరువాత ఐదేళ్ళపాటూ నేనెంతో కష్టపడి చదివాను. ఒక మహత్తర జీవితం, ప్రజాసేవలో గడపాలనే తీవ్రవాంఛ నన్ను ఆవేశపెట్టింది. పర్యవసానాన్ని బట్టి చేసే పనుల విలువను అంచనా వేయటంవల్లనే నేను యూనివర్శిటీ ఫస్ట్లో పాసవగలిగాను. ఇది విని నాన్నే కాదు. నాకు తెలిసిన చాలామందీ, తెలియనివాళ్లు కూడా అభినందించారు. నా ప్రాక్టీసు అమోఘంగా వుండగలదని, లక్షలు సంపాయిస్తాననీ వీళ్లందరూ అంచనాలు వేశారు. నా తోటి విద్యార్థులు ఈర్ష్యపడ్డారంటే ఆశ్చర్యం లేదు.

నాన్న ఎంతో సంతోషించాడు. ఇన్నాళ్లు ఎన్ని అవస్థలు పడి నాన్న ఈ డబ్బు తెచ్చాడో నాకు తెలియదు. తీరా తెలుసుకుంటే నాన్న ప్రావిడెంట్ ఫండ్ సరిపోలేదు. ఆయన పెన్షన్ కూడా అమ్మవలసి వొచ్చింది. ఆయన ఆశలన్నీ నామీదనే వున్నవి. అయితే ఆయనకు అన్యాయం చేయలేను- నా ఆదర్శం చెడనంతవరకూ.

డాక్టర్ గోపాలం కిందటేడు చనిపొయ్యాడు. చాలా బీదతనంలో నానా బాధలు పడ్డాట్ట! ప్రజాభిప్రాయం అర్థం లేనిదే కావొచ్చు. కాని, దానిశక్తి అమోఘం. ఆయన

నామీద కసి తీర్చుకోనందువల్ల, ఆయన తప్పుగానే పరిగణించి, రోగులకు శత్రువనే భావం కలిగింది. కాని నిజాన్ని తెలియచెప్పి, ఒప్పించగలగటం ఎవరితరం? అది నా కొక్కడికే తెలుసు. ప్రక్రియ చేయలేని బలహీనతతో బాధపడ్డాను.

ఆదర్శం చాలా గొప్పదే కావొచ్చు. కాని ఆదర్శాలకూ, నిత్య జీవితానికీ లంకె కుదరదు. ఈరెంటి మధ్యా ఏర్పడే లోతును పూడ్చుకోవాలి. కష్టాలు ఎదురైతే సహించాలి. బాధలు పడాలి. త్యాగాలు అవసరమైతే చేయాలి. ఒకచోట కూర్చొని ఆలోచించి వేయిన్నొక్క గొప్ప ఆదర్శాలను కాగితం మీద రాయగలిగినవాడు గొప్ప రచయిత అవుతాడు; ఐతే అతను త్యాగం చేసిందేమీ లేదు. వినేందుకూ, చదువుకునేందుకూ అవన్నీ అద్భుతంగానే ఉంటవి. ఇంతకన్నా ఆ వేయిన్నొక్క ఆదర్శాలలోనూ ఒక్కటి, ఒక్కటంటే వొక్కటి, నిత్యజీవితంలో ఆచరించగలిగాడా అనేది ప్రశ్న. అతనే కాదు; అవి చదివి మెచ్చుకునేవాళ్లలో ఒక్కడన్నా ఆ పని చేయగలిగాడా? నిజంగా అలా ఎవరన్నా చేయగలిగినా, అతనికి కీర్తిరాదు సరికదా, పైపెచ్చు మూర్ఖుడుగా కూడా పరిగణించ బడొచ్చు. అయితే ఆదర్శాలను వల్లించిన వాడికన్న, ఒక్క ఆదర్శాన్ని పట్టుకొని వేళ్ళాడ గలిగినవాడు ధన్యుడు. అత్యుత్తముడు– అతను అనుభవించ లేకపోగాక. సర్వ నాశనమౌగాక. ఆ ఉత్తమ జీవితానికి ఒక అర్థం, అమరత్వం వుంటుందనేమాట ఎవరైనా ఒప్పుకోక తప్పదు కదా!

నా పని అంతే ఐంది. అందరూ అనుకున్నట్లు నాకు నమ్మకం లేదు. నా కళ్ళముందు కనిపించే ఒకేఒక్క రాజమార్గం, దానిగుండానే నడకసాగిస్తున్నాను.

నా ప్రాక్టీస్ నాకు తప్ప మిగతా అందరికీ డిసప్పాయింటింగానే వుంది. పైకి అనడుకానీ, నాన్నకు అసంతృప్తిగా ఉన్నదని నాకు తెలుసు. జాగ్రత్తగా ఆలోచిస్తే ఈ అసంతృప్తి దేనికి? ఏదో వొస్తోంది. జీవితం సాగుతోంది. సుఖపడగలం– మేడలూ, మిద్దెలూ కార్లూ లేకుంటేనేం? కారువుంటే నీవు సుఖపడతావు; నీ కారు రేపే దుమ్ములో మిగతావాళ్లు బాధపడతారు– కాని నీవు ఇతరులకు చేసిన ఉపకారం ఏముంటుంది? అది నేను చేయగలుగుతూన్నందుకే గర్వంగా వుంటుంది. ఈ ఆత్మతృప్తి మరోవిధంగా దొరుకుతుందా?

నాతోపాటు ప్రాక్టీస్‌లు పెట్టినవాళ్లు ఎంతో సంపాయించారు. వారి కీర్తి గూడా బాగా పెరిగింది. నన్ను ఎగతాళి చేస్తుంటారు. నేను రోగుల్ని పిండలేను. ఇస్తే తీసుకుంటాను, లేకుంటే లేదు. వృత్తి గౌరవాన్ని పాడుచేస్తానని మిగతా డాక్టర్ల అభిప్రాయం. వృత్తి గౌరవం సంపాయించే డబ్బునుబట్టి ఉండేట్లయితే, వ్యభిచారిణి సంపాదనకు గౌరవం ఎందుకు లేదు?

ఈ పద్ధతిలో ఐతే ఏనాటికీ నేను భాగ్యవంతుణ్ని కాలేను. ఆ సంగతి నాకు తెలుసు. ఐతే ఈ భాగ్యభోగాలమీద నాకు దృష్టిలేదు. అసలు అందువల్ల గర్వపోతునై,

నా ఆదర్శాన్ని మరిచిపోతానేమోననే భయంకూడా వుంది. భుక్తికి లోటులేనంత కాలమూ, మిగతా విలాసాలను గూర్చి విచారించను. నేను సాధారణ మానవుణ్ని కాకుండా చేసి, నా జీవితాన్ని ఒకేబాటలో నడిచేట్లు చేసింది ఆ సంఘటన. నేను ఈ దారి తప్పలేను.

నన్ను గూర్చి నానారకాలుగానూ అనుకోవటం బహుశా నీవు వినే ఉంటావు. నేనీ బీదలకు సహాయపడటం కీర్తికోసమనీ, ఇదంతా ఒక పోజ్ అనీ అనుకుంటున్నారు కొందరు. ఐతే ఇలాటి కీర్తి నాతోటి డాక్టర్లకు కూడా లభ్యమౌతుందికదా? వారు దానికోసమై ఎందుకు ప్రయత్నించరు? నామీదపడి ఏడవటం దేనికి? వృత్తిలో రేట్లు తగ్గించబడినవని- అనుకుంటాను!

పెద్దపెద్ద డిన్నర్ పార్టీలకు నాకు పిలుపురాదు; ఒకవేళ వొచ్చినా నేను పోను. నాకు దక్కే ఆత్మతృప్తే నాకు చాలు. యీ పైవన్నీ వొట్టి బూటకాలుగానూ, నటనలుగానూ కనిపిస్తవి... ఇలాగే రోజులు గడుస్తూన్నవి.

ఆరునెల్ల క్రితం నీతో స్నేహమైంది. కొత్త స్నేహితులంటే భయం నాకు. ఎప్పుడన్నా పొరపాటున వారు మాట్లాడే మాటల మాధుర్యానికి నా ఆదర్శాన్ని బలిపెట్టటాన్ని గూర్చి ఆలోచిస్తానేమో? అందులోనూ ఆడదంటే మరీ భయం... కాని, నేనూ మానవుణ్నే కనుక, మానవులు చేసే పొరపాట్లు కొన్ని చేయక తప్పదు. ఐతే జరిగిన పొరపాటును సరిదిద్దుకోగల సామర్థ్యత లేనిదే, దాని జోలికి పోకూడదని నిశ్చయించుకొన్నాను.

ఉభయులమూ రోజు రోజుకూ దగ్గరవసాగాం. కాని రెండు విరుద్ధ శక్తులు సంఘర్షిస్తవేమోననే భయం వుంది నాకు. 'జాగర్త' అని అంతరాత్మ హెచ్చరికలు చేస్తూనేవుంది. నా ఆదర్శంముందు యీ ప్రపంచంలో ప్రతిదీ చాలా అల్పంగానూ, క్షుద్రంగానూ కనిపిస్తుంది. చివరకు మన ప్రణయం కూడాను.

యీ మాట వింటే నీకు కోపం రావచ్చు. ప్రణయాన్ని గూర్చి అత్యుత్తమంగా, అద్భుతంగా మాట్లాడి, దాని పవిత్రతనే అనుమానించవొచ్చు. నీవు ఎంత ఎత్తుకు ఎత్తుతేనేం? దాని పునాది నేలలోనే వుందనే సంగతి మరచిపోవోక! ఆదర్శం ఆకాశంలోనూ, కాళ్లు భూమిలోనూ దేనికి!

ఇన్నాళ్లూ మన స్నేహానికి ఒక శాశ్వత రూపాన్నివ్వటం మీద, నా అభిప్రాయాన్ని అడుగుతున్నప్పటికీ నేను చెప్పలేదు. ఎందుకంటే, నా ఆశయం వేరు, నీ ఆశయం వేరూను. యీ రెండూ కలిస్తేనే మనం కలవగలం. ఐతే నా ఆశయాన్ని గూర్చి నీకు చెప్పటం ఎలాగా అని ఆలోచిస్తూనే గడిపాను. ఐనా ఆ కారణంగానే నేను ఇన్నాళ్లు బ్రహ్మచర్య జీవితాన్ని గడుపుతున్నాను.

ఇందులో కొంతచెప్పి, కొంత చెప్పనట్లయితే నీవు అర్థం చేసుకోలేకపోతావేమోననే బాధవుంది. చెప్పేప్పుడు నీ ప్రతి కదలికనూ గమనించినట్లయితే, మధ్యలో నేను

చెప్పవలసింది బైటపడదేమోననే అనుమానం కూడా వుంది. అందుకనే నా కథను పూర్తిగా రాస్తున్నాను.

ఇదివరకు రెండుసార్లు మాట్లాడుతూండగా రోగి దగ్గిర్నుంచి పిలుపువొస్తే, ఉన్నపళంగా పరుగెత్తాను. నన్ను ఆపాలని నీవు చాలా చాలా ప్రయత్నించావు. నా ఆదర్శానికి నీ ప్రవర్తన విషసర్పంలాగు తోచింది. ఆదర్శపు శిఖరంమీద నిలబడి చూస్తే, నీవూ నీ ప్రణయమూ అసలు కనిపించటమే లేదు.

రోజా! ఆ రోగి ఎవరనుకున్నావు– నాతమ్ముడు! ఆ కబురు ఏమిటనుకున్నావు? ఆనాడు నేను డాక్టర్ గోపాలాన్ని కొట్టిన చెంపదెబ్బ! అప్రయత్నంగా నా చెంపమీదికి చెయ్యి వెళ్లటాన్ని నీవు గమనించి ఉండవు. యీ రెండు సత్యాలముందూ, మిగతా ప్రపంచమంతా కేవలం భ్రమగా తోస్తుంది నాకు. యీ సత్యాలు అసలు వస్తువులైతే, మిగతావి వాటి నీడలు. నేను చూస్తూ చూస్తూ ఆ నీడలకు ఎర కాలేను.

యీ చెంపపెట్టు నేను ఎన్నోసార్లు అనుభవించాను. కాని దాని శక్తి ఎన్నటికి తగ్గదనే తోస్తుంది. తగ్గనంతకాలం నా ఆదర్శానికి చలనం లేదు.

ఇక, రాత్రి మనం సినిమా చూస్తూ ఉండగా రోగి దగ్గిర్నుంచి కబురు వొచ్చింది. వెంటనే బయలుదేరాను. వెళ్తే నాతో మాట్లాడనన్నావు. ఒక్క క్షణం ఆలోచించాను. కాని నా ఆదర్శం ముందు, మిగతావన్నీ ఎంత అల్పమైనవో కళ్ళకు కట్టింది. నీవిక నాతో మాట్లాడక పోవచ్చు. అందుకనే యీ ఉత్తరం చదువుకొని ఆలోచించు.

రోగి నా తమ్ముడే అయి, అతని పిలుపు నాకు చెంపపెట్టయితే, మతి వున్న నేను, ప్రణయాన్ని కాలదన్నటంలో అబ్బురమేమిటి! నాకీ మనోధైర్యం వున్నందుకు నన్ను నేను అభినందించుకో గలను.

ప్రతి క్షణమూ ఎంత విలువైనదో, బాధ్యత నెరిగిన డాక్టర్‌కు తెలుసు. యమునితో ఒక్కడూ పోరాడలేని రోగికి తోడుగా వెళ్తున్నాను. నాశక్తినంతా వినియోగించి చూస్తాను. ఒక్క మానవ ప్రాణిని రక్షించగలుగుతే చాలదా? ఎవర్ని వారు ఉద్ధరించుకుంటూ వేరొకరికి సహాయపడటం, ప్రణయోపాసనకన్న లక్షరెట్లు నయం.

ఇవన్నీ ఆలోచించి, నీవు ఆదర్శాన్ని అంగీకరించి, నా వెనుక ఉండి నన్ను ప్రోత్సహించ గలుగుతే మన స్నేహానికి ఒక శాశ్వతరూపం ఇవ్వగలను; లేదా– నాకు విచారం లేదు. ఏదీ వుండనీ, ఉండకుండనీ, నాకు యీ ఒక్క ఆదర్శమూ ఉంటేచాలు.

ఇదీ నా కథ. నీవు తలుచుకుంటే ఒక మహత్తర దేవతా శక్తివలె నా జీవితాన్ని వెలిగించగలవు. లేదా నిన్ను ప్రాపంచిక విషయాలే ఆకర్షిస్తే, నేను చెప్పవలసింది లేదు.

ఆపైన నీ యిష్టం... ఉంటాను మరి...

– డాక్టర్.